క్లుప్తంగా

నీట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థినికి సన్మానం



ఫాతిమాను శాలువాతో సన్మానిస్తున్న సుగుణ

కెరమెరి: నీట్‌లో ర్యాంకు సాధించిన మండలంలోని సుల్తాన్‌గూడకు చెందిన సఫూర ఫాతిమాను శుక్రవారం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులు వైద్యవిద్య కోర్సుల్లో ప్రతిభ కనబర్చడం గర్వకారణమన్నారు. నాయకులు సుజాయత్‌ఖాన్, సయిద్‌ఖాన్, కనక ప్రతిభ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్ రూరల్: భీమిని మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన ఎర్రం అరుణ్, ఇప్ప సురేశ్‌లకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబు లబ్ధిదారులకు అందజేశారు. ఇద్దరికి రూ.48,500లకు సంబంధించిన చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం సహాయనిధిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొండ్ర ప్రభాకర్‌గౌడ్, లింగమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని సంజీవనగర్ గ్రామానికి చెందిన నల్లగొండ సాగర్‌కు రూ.13500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరు కాగా.. లబ్ధిదారుడికి బీజేపీ నాయకులు శుక్రవారం అందచేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జునుగరి మధుకర్, ఘనపురం నగేశ్, బండి ప్రభాకర్, చిలువేరు భాస్కర్, వైకుంఠం, జునుగరి ప్రభాకర్ పాల్గొన్నారు.

‘ఆర్‌ఎస్‌ఎస్’ ఉత్సవాలను విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సంస్థను ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈనెల 28న జిల్లా కేంద్రంలోని జుబ్లీ మార్కెట్ సత్యసాయి ధ్యాన మందిరం వద్ద నిర్వహిస్తున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని సమితి ప్రముఖ్ గుర్రాల వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ ఉత్సవాలకు హిందువులు అధిక సంఖ్యలో హాజరై ఐక్యత చాటుతూ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో శత జయంతి ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వెన్షన్ పోస్టర్లను సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 5, 6 తేదీల్లో కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్‌గార్డెన్‌లో జరిగే రాష్ట్రస్థాయి సభలకు రాష్ట్ర మహిళా నాయకులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలో శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆర్థిక రాజకీయ, సామాజిక ఉద్యోగ భద్రత తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని పేర్కొన్నారు. అక్టోబర్ 5న పట్టణంలో భారీ ప్రదర్శన అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. స్కీమ్ వర్కర్లతోపాటు ఇతర రంగాల కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు త్రివేణి, కృష్ణమాచారి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఇంటర్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఇంటర్మీడియెట్ బోర్డు అబ్జర్వర్ వెంకటేశం అన్నారు. రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు ప్రభుత్వం ముఖ గుర్తింపు హాజరు ప్రక్రియను తీసుకువచ్చిందన్నారు. తల్లిదండ్రులు సైతం కళాశాలలో నిర్వహించే సమావేశాలకు హాజరై పిల్లల పురోగతిని తెలుసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ అతియా ఖానంతోపాటు అధ్యాపకులు రాష్ట్ర అబ్జర్వర్, డీఐఈవో రాందాస్‌ను శాలువాలతో సన్మానించారు. అనంతరం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గంగాధర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో అరకకు డిమాండ్

- ఒక్క రోజుకు రూ.2 వేలు కూలి
- యాంత్రిక వ్యవసాయంతో దొరకని దౌరలు
- గ్రామాల్లో ఎడ్ల కొరత



రాజురలో పత్తిలో అరక కొడుతున్న రైతు

ఆసిఫాబాద్‌రూరల్: వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతోంది. ఆధునిక వ్యవసాయంలో ట్రాక్టర్ల వినియోగం పెరిగింది. వ్యవసాయంలో కీలకమైన కాడెడ్లు కనుమరుగవుతున్నాయి. దీంతో పత్తిలో అరకకు డిమాండ్ పెరిగింది. విత్తనాలు వేసేందుకు అరకతో కూడిన కాడెడ్లకు రూ.1500 నుంచి రూ.2000 చెల్లిస్తున్నారు. రైతులు ఎక్కువగా వ్యవసాయ పనులకు ట్రాక్టర్ వినియోగిస్తున్నారు. అరకతో ఒకరోజు చేయాల్సిన పనిని ట్రాక్టర్ ఒక గంటలో పూర్తి చేస్తుంది. అయితే పత్తి మొలకెత్తిన తరువాత కలుపు నివారణ, తేమ శాతం పెంచేందుకు మాత్రం ఎడ్లతో కూడిన అరక వినియోగిస్తున్నారు.

అరక ఉంటే చేతినిండా పని..

ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా కాడెడ్లు తక్కువ ఉండడంతో అరకకు డిమాండ్ పెరిగింది. గతంలో ఇరుగుపొరుగు వారు కలిసి విత్తనాలు వేసుకునేవారు. కానీ ప్రస్తుతం భూమిలో తేమ ఆరిపోతుందనే ఉద్దేశంతో ఎవరికి వారే విత్తనాలు వేస్తూ కాడెడ్ల కోసం ఇతరులపై ఆధారపడుతున్నారు. పత్తి, వేరుశనగ, కంది విత్తనాలను కాడెడ్లతోనే వేస్తుంటారు. పొలం పనుల్లో గొర్రు, అరకకు కాడెడ్లను వినియోగిస్తుంటారు. పత్తిలో కలుపు నివారణ, తేమ కోసం దౌర తప్పనిసరి కావడంతో అరక ఉన్న రైతులకు వారం ముందే అడ్వాన్సులు ఇస్తున్నారు. ట్రాక్టర్ ఉన్న వాళ్లు సైతం పత్తిలో అరకపై ఆధారపడాల్సిందే. దీంతో అరకకు రోజుకు రూ.2000పైన చెల్లిస్తున్నా ఒక్కోసారి అనుకున్న రోజు దొరకడం లేదు. అరక ఉన్న వారు వారి సొంత పొలం పనులు ముగిసిన తర్వాత కూలీకి వస్తున్నారు.

ఎడ్లను పోషించలేక..

ఒకప్పుడు ప్రతీ రైతుకు కనీసం నాలుగైదు కాడెడ్లు, ఆవులు ఉండేవి. ప్రస్తుతం ఆధునిక వ్యవసాయ పద్ధతుల నేపథ్యంలో ఎడ్లతో అవసరం తగ్గింది. ఒక రోజు చేయాల్సిన పని ఒక గంటలో పూర్తవుతుండడంతో బీడు భూములు లేకుండా పత్తి పంట సాగు చేస్తున్నారు. దీంతో మేత కోసం స్థలం లేక చాలా గ్రామాల్లో రైతులు పశువులను అమ్ముకుంటున్నారు. అటవీ ప్రాంతం ఉన్న గ్రామాల్లో మాత్రమే పశువులు ఎక్కువగా కన్పిస్తున్నాయి. కాడెడ్లను పోషించే స్థోమత రైతన్నలకు ఉన్నా వాటికి నీరు పెట్టడం, మేత వేయడం వంటి పనులు చేయలేక అమ్మేస్తున్నారు. ఏ గ్రామంలో చూసిన అరకతో వ్యవసాయం చేసే వారు చాలా తక్కువ కన్పిస్తున్నారు. దీనికి తోడు దుక్కి దున్నడం నుంచి పంట కోసే వరకు ప్రతీ పనిని ట్రాక్టర్‌తో చేయడం.. ఒక్కో గ్రామంలో పదికి పైగా ట్రాక్టర్లు ఉండటంతో రైతులు వాటివైపు దృష్టి పెడుతున్నారు. ఆసిఫాబాద్ మండలంలో సుమారు 350కి పైగానే ట్రాక్టర్లు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

దౌర తప్పనిసరి

పత్తిలో గడ్డి నివారణకు, తేమ శాతం పెంచేందుకు దౌర తప్పనిసరిగా మారింది. నేను ఎనిమిది ఎకరాల్లో పత్తి పంట సాగు చేసిన. దౌర పూర్తవడానికి రూ. 45 వేలు ఖర్చవుతాయి. కూలీ ఎక్కువగా చెల్లిస్తున్నా అనుకున్న రోజు అరక దొరకడం లేదు.

– మల్లేశ్, రైతు

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబురాలు



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెంచికల్‌పేట్: సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డిల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా శుక్రవారం పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు, కోనేరు అభిమానులు సంబురాలు జరుపుకున్నారు. రానున్న రోజుల్లో సిర్పూర్‌లో గులాబీ జెండా ఎగురవేస్తామన్నారు.

బెజ్జూర్: మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరడంతో ఆయన అభిమానులు సంబురాలు జరుపుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పెద్దఎత్తున బాణాసంచాలు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న అంగన్‌వాడీ టీచర్లు



బతుకమ్మ ఆడుతున్న సుగుణ

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు రంగురంగు పూలతో బతుకమ్మలను పేర్చారు. అంతకు ముందు పోషణమాసం కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమతం, మహిళలకు పోషకాహారం ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హసీనా, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆత్మగౌరవానికి ప్రతీక

కెరమెరి: బతుకమ్మ ఆడబిడ్డల ఆత్మ గౌరవానికి ప్రతీక అని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. శుక్రవారం మండలంలోని మోడి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఇందిరా ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొని బతుకమ్మ ఆడారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, నాయకులు మునీర్, కుసుంబ్‌రావు, సుజాయత్, ఇందిరా, ప్రతిభ, మహేశ్వరి, కౌసల్య, యశోద తదితరులు ఉన్నారు.

‘ఉపాధిహామీ’ సామాజిక తనిఖీ ప్రజావేదిక

వాంకిడి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2024 –25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఈ నెల 16 నుంచి 26వ తేదీ వరకు గ్రామ పంచాయతీల వారీగా సేకరించిన వివరాలను ప్రజావేదికలో వెల్లడించారు. జిల్లా విజిలెన్స్ అధికారి ఆంజనేయులు, హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ చంద్రశేఖర్‌లు ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించి నివేదికలు పరిశీలించారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో 474 ఉపాధి హామీ పనులకు రూ.6,91,53,228, పంచాయతీ రాజ్‌లో 73 పనులకు రూ.2,88,76,805 ఖర్చయినట్లు అధికారులు తెలిపారు. సామాజిక తనిఖీలో మస్టర్లలో సంతకాలు తేడాగా ఉండటం, పని ప్రదేశాలకు సంబంధించిన ఫొటోలు అందుబాటులో లేకపోవడం, ఎంబీలలో నమోదు చేసిన కొలతలు సరితూగకపోవడం, పలు మస్టర్లలో అధికారుల సంతకాలు లేకపోవడం, ఒకే కుటుంబంలో రెండు జాబ్‌కార్డులు ఉండటం, 100 రోజుల కంటే ఎక్కువ పని దినాలు కల్పించడం వంటి అవకతవకలను గుర్తించినట్లు తెలిపారు. అధికారులు అన్నీ గ్రామ పంచాయతీలను కలుపుకుని రూ.1,68,784 రికవరీ, రూ. 50,550 జరిమానా, రూ.1,79,499 నిధుల వినియోగంపై వివరణ ఇవ్వాల్సిందిగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సోనాపూర్ ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంబెడ్స్‌మెన్ సాయిశ్రీ, స్టేట్ టీమ్ మేనేజర్ వేణు, ఎంపీడీవో ఖాజా అజీజుద్దీన్, ఏపీవో శ్రావణ్ కుమార్, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి



తిర్యాణి: నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు



నివాళులర్పిస్తున్న అధికారులు

తిర్యాణి: ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని రజకులు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని రజక సంఘం మండల అధ్యక్షుడు బూసి సంతోష్ అన్నారు. శుక్రవారం ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఐలమ్మ విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడంతో పాటు తెలంగాణ తల్లిగా గుర్తించాలన్నారు. సంఘం నాయకులు రాగళ్ల రాజమౌళి, దుర్శెట్టి సతీశ్, నల్లూరి జగదీశ్, సాగర్, స్వప్న, భవాని, నల్లూరి రాజు, కాల్వ మల్లేశ్ తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్ టౌన్: భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ద్వారకానగర్ కాలనీలోని దోబీఘాట్ వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఐలమ్మ పోరాటాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తన ప్రాణాలను లెక్కచేయకుండా పెత్తందారులు భూస్వాములు, రజాకార్లపై పోరాటం చేసి లక్షల ఎకరాల బడుగు బలహీన వర్గాలకు పంచిందన్నారు. అంతకు ముందు ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గణపతి, షబ్బీర్, రమణయ్య, ఆవుల రాజ్‌కుమార్, గజ్జెల లక్ష్మణ్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కౌటాల: దొరల, రజాకర్ల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ అందరికీ ఆదర్శవంతురాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి రాజేందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం కౌటాల రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమికోసం, భుక్తికోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. చాకలి ఐలమ్మ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, సాయికృష్ణ, రాచకొండ అశోక్, వానుపటేల్, మిథున్, మధుకర్, భూమయ్య, గట్టయ్య పాల్గొన్నారు.

దుర్గామాతకు ఘనంగా పూజలు



లక్ష్మీదేవి అవతారంలో దర్శనమిస్తున్న దుర్గామాత



ఇందిరానగర్‌లో..



రేణుకఎల్లమ్మ ఆలయంలో మహిళల పూజలు

రెబ్బెన: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు దుర్గామాత లక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని గోలేటి, నంబాల, రెబ్బెన, ఇందిరానగర్, గంగాపూర్‌లలో దేవీ నవరాత్రి ఉత్సవాలను భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి ఆలయంలో దుర్గామాతను భారీగా భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. మహిళలు కుంకుమపూజలు నిర్వహించి అమ్మవారికి పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ స్వామి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్‌లు ఎమ్మెల్యేను సన్మానించి అమ్మవారి చిత్రపటం అందజేశారు. అలాగే గోలేటి, నంబాలలలో ప్రతిష్ఠించి అమ్మవారి విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూర ఓసీపీలోని దుర్గామాత ఆలయంలో హోమం నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. బీపీఏ ఓసీపీలోని దుర్గామాత ఆలయంలో సప్త చండీయాగం నిర్వహించారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో..

మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గౌడ సంఘం మహిళలు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఆలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ అన్నపూర్ణ మురళి గౌడ్, సొసైటీ అధ్యక్షుడు తాళ్లపల్లి కిష్టాగౌడ్, నాయకులు సుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సర్వేశ్వర్‌గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, తిరుపతిగౌడ్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమార్చన

దహెగాం: మండల కేంద్రంలోని దుర్గామాత మండపం వద్ద శుక్రవారం దేవి నవరాత్రులను పురస్కరించుకుని కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. అమ్మవారికి మొక్కులను చెల్లించి, చల్లగా చూడాలని భక్తశ్రద్ధలతో పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ

కెరమెరి: మండల కేంద్రంలోని దుర్గాదేవి మండపాల వద్ద శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ నిర్వహించారు. కళశ పూజ, గణపతిపూజ, అంగపూజ, గౌరీ పూజ, కుంకుమ పూజ నిర్వహించారు. గౌరమ్మను వేడుకున్నారు. పురోహితుడు కులకర్ణి బాపూజి దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుజాల్‌పురం దుర్గమ్మ గుడిలోని అమ్మవారు లక్ష్మీదేవి రూపంలో దర్శనమిచ్చారు.

కౌటాల: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా శారదదేవి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దుర్గామాతకు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన చేపట్టారు. అనంతరం ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



కెరమెరి: లక్ష్మీదేవి రూపంలో దుర్గాదేవి



కెరమెరి: కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



బస్టాండ్ పక్కనే చెత్తాచెదారం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా బస్‌స్టేషన్‌లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. బస్‌స్టేషన్ చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోయింది. పక్కనే మురికి నీరు నిల్వ ఉండడంతో ఆవరణలో దుర్గంధం వెదజల్లుతుంది. ప్రయాణికులకు తాగు నీటి కోసం ఏర్పాటు చేసిన కులాయిలు సైతం సరిగా పని చేయడం లేదు. తాగునీటి సౌకర్యం లేకపోవడం, పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.



పని చేయని మంచి నీటి ట్యాబ్



పెరిగిన పిచ్చిమొక్కలు

పట్టా పాస్ పుస్తకాలు పునరుద్ధరించాలి



ఏవో కిరణ్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

బెజ్జూర్: పట్టా పాస్ పుస్తకాలు పునరుద్ధరించాలని మండలంలోని చిన్న గ్రామానికి చెందిన రైతులు కోరారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ దండే విఠల్ నివాసంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో చిన్న సిద్దాపూర్, ఎలుకపల్లి గ్రామాలకు చెందిన రైతులకు అసైన్‌మెంట్ పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. వాటిని 2018లో భూప్రక్షాళన సర్వేలో కేసీఆర్ ప్రభుత్వం నిలుపుదల చేసిందన్నారు. నూతన పాస్ పుస్తకాలు రాక పంట రుణాలు, బ్యాంకు రుణాలు, పరిహారం, యూరియా అందక దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్సీ జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏవో కిరణ్‌కు సైతం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతులు నికూరి నగేశ్, నారాయణ, శ్రీనివాస్, మోర్లె మహేశ్, సామల శ్రీనివాస్, కావుడ భీంరావు పాల్గొన్నారు.

లక్కీడ్రా నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలి

ఆసిఫాబాద్: జిల్లాలో దుర్గామాత, గణేశ్ పేరుతో లక్కీ డ్రా నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో స్థానిక యువకులపై కేసులు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కార్తిక్, నికిల్ తదితరులు ఉన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం రాత్రి పురవీధుల గుండా స్వామివారి వాహనాన్ని ఊరేగించారు. మహిళలు, భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు.